

# జవాబు కొట్టుకొచ్చింది !!

★ వి. యస్. కృష్ణ ★

"సంగీతం, చదువు గల చురుకైన 16 సం॥ల పిల్లకు సుమారు 20 సం॥లు వయసుగల ఆర్వేల నియోగ బ్రాహ్మణ కుటుంబమునకు చెందిన వరుడు కావలెను. ఇతర వివరాలకు పోస్టుబాక్సు ఎమ్-2013. —పత్రిక"

యీ ప్రకటన మా బాలయ్య కంట పడింది. చూసినవాడు తిన్నగా ఊరుకోక నాక్కూడా చూపించి దాంతో ఏదేనా చిన్న తమాషా ఆడితే గాని లాభం లేదన్నాడు. అసలు మొదట్నుంచీ నాకు యిలాంటి వేషాలు కిట్టవు. వున్నవాళ్లము తిన్నగా వుండక యీ అల్లరి పనులుకూడా ఏమిటి? యిప్పటికే యీ పరాయి వూళ్లో మా చదువులకు నెలకు సుమారు రు 80 లు ఖర్చు చేస్తున్నాము. దానికితోడు యివికూడా ఏమిటి? కాని ఎంత బోధపర్చినా బాలయ్య వింటేగా! సరే కానియ్యవోయి అన్నాను.

అందమైన ఒక లెటరుహెడ్డు తీసేడు. దాని మీద తన ఫోటో, విలాసము, చదువు మొదలైన వివరాలతోసహా హాస్యధోరణిలో ఒక దరఖాస్తు తయారుచేసేడు. వందలకొలది వివాహ ప్రకటనలు కనపడుతూంటే ప్రత్యేకంగా యీ ప్రకటన తనని బాగా ఆకర్షించిందిట వారి ప్రకటనే యింత ఆకర్షణీయంగా వుంటే తమ పుత్రికా రత్నము యింకెంత ఆకర్షణీయంగా వుంటుందో ఊహించుకోలేక రాత్రులు నిద్రలేక పగలు సరిగా తిండి తినలేక అవస్థలు పడుతున్నాట్ట!

చాలమంది స్త్రీలు తన ఫోటోను యిదివరకే చూసి అపరిమితంగా మెచ్చుకున్నారుట; అందుచేత 2013 గారి కుమార్తె తప్పకుండా మెచ్చుకొని తీరుతుందని తను అనుకుంటున్నాట్ట! 2013 గారు తమ కుమార్తె ఫోటోతో సహా సంతోషకరమైన జవాబు వెంటనే రాయకపోతే తను ఏ నుయ్యో గొయ్యో చూసుకోవడం సత్యం! తన బియ్యే చదువు నట్టేట గలవాల్సిందే! యీ ధోరణిలో మావాడు ఒక పెద్ద దరఖాస్తు రాసి 2013 గారికి పంపించేశాడు.

పంపి మూడు రోజులైందో లేదో ప్రతిరోజూ యింకా రాలేదేమి చెప్మా జవాబు అని ఒకటే గోల! తమాషాకి రాసిన దరఖాస్తుకోసం వీడింత వెర్రెత్తుతున్నాడేమి చెప్మా అని నేను అనుకున్నాను. పైకి ఏమీ అనకపోయినా నాకూ లోపల చాలా ఆతృతగానే వుంది ఏం జవాబొస్తుందో చూదామని. ఇలా చూడగా చూడగా ఒకనాడు 2013 గారినుంచి జవాబు కొట్టుకొచ్చింది.

"అయితే యివాళ మన ఆల్బముకి ఒక కొత్త ఫోటోరా" అంటూ బాలయ్య కవరు విప్పేడు. "....గారికి తమరు పంపిన ఫోటో, దరఖాస్తు అందినవి. ఓయి వెధవాయి యిప్పటికేనా యిలాంటి వెర్రివేషాలు కట్టిపెట్టి తిన్నగా చదువుకో! పత్రికలోని ప్రకటన నీ చిన్నచెల్లికి వరుడుకోసం అని తెలుసుకో!...." అని తన తండ్రి రాసిన ఉత్తరం యింకా పూర్తిగా చదవకుండానే బాలయ్య నేలమీద కూలబడ్డాడు.